సాక్షి ఖమ్మం

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం
జిల్లా అంతటా మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

52పోస్టులకు భారీగా దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కళాశాల ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా భారీ సంఖ్యలో అభ్యర్థులు ముందుకొచ్చారు. దరఖాస్తుకు సోమవారం చివరి రోజు కావడంతో బారులుదీరారు. మొత్తం 52 రకాల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించగా, పోస్టులు ఎక్కువగా ఉండడంతో భారీగా స్పందన లభించింది. చివరి రోజే వెయ్యికి పైగా దరఖాస్తులు అందాయని, అన్నీ పరిశీలించాక స్పష్టత రానుందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు.

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈఓ, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 3నుండి 12వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ కె.జగన్మోహన్ రావు తెలిపారు. ఆలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. తొలిరోజైన 3వ తేదీన శ్రీవారికి సర్వాంగ అభిషేకం, తీర్థపు బిందె తీసుకొచ్చి ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే, 4న కలశస్థాపన, గణపతి హోమం, 5న శ్రీగాయత్రిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, 6న శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, 7న ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, 8న అమ్మవారికి శ్రీలలితా పరమేశ్వరి అలంకారం, 9న శ్రీసరస్వతీదేవి అలంకరణ, 10న శ్రీదుర్గాదేవికి ప్రత్యేక పూజలు, 11న మహాపూర్ణాహుతి, 12న శమీ పూజ నిర్వహించడంతో పాటు అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవిగా అలంకరిస్తామని వెల్లడించారు. ఈసమావేశంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, తదితరులున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా

బోనకల్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ రవాణాను నియంత్రించేందుకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. బోనకల్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. కేసుల నమోదు విషయంలో తాత్సారం చేయకుండా దర్యాప్తులో నాణ్యత పాటిస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు ఆరా తీసిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు.

నేటి నుంచి ప్రత్యేక శిబిరం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల వరదలతో పదో తరగతి సర్టిఫికెట్లు కోల్పోయిన వారి వివరాల సేకరణకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పాత డీఈఓ కార్యాలయం వద్ద ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. సర్టిఫికెట్లు కోల్పోయిన వారు పదో తరగతికి సంబంధించిన ధ్రువపత్రాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆపై రాష్ట్ర కార్యాలయానికి పంపించి సర్టిఫికెట్లు జారీ చేయిస్తామని డీఈఓ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు.

బదిలీలపై సీఎండీ సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీలపై ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సోమవారం సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా వివిధ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్పీడీసీఎల్‌లో డివిజన్, సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాల స్థాయిలో అధికారులు, ఇంజనీర్లు, బదిలీల వివరాలు ఆరా తీశారు. ఇప్పటికే రూపొందించిన జాబితా, అభ్యంతరాలపై ఆయన చర్చించారు. బదిలీల ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని సీఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎస్ఈ సురేందర్, డివిజనల్ ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆ నలుగురే?!



సీఎంఆర్ ముడుపులపై బిగుస్తున్న ఉచ్చు

- నలుగురు అధికారులపై ఆరోపణల వెల్లువ
- డబ్బు ముట్టజెప్పినా తనిఖీలు జరగడంతో బయటపెట్టిన మిల్లర్లు
- సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశాలు
- నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలకు అవకాశం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఐదు మిల్లుల యాజమాన్యాలు సీఎంఆర్ చెల్లించకపోవడంతో ఆరా తీయగా తెరవెనక భారీ కుంభకోణమే జరిగిందని ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. రూ.200 కోట్లకు పైగా విలువైన సీఎంఆర్ ఎగవేతలో మిల్లర్ల మాయాజాలంతో పౌర సరఫరాల సంస్థ అధికారులపైనా ఆరోపణలు వచ్చాయి. రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు ఈ వ్యవహారంలో ఉద్యోగుల స్థాయి ఆధారంగా అందినట్లు చర్చ జరుగుతోంది. 'డబ్బులు ఇచ్చినా తనిఖీలు ఎలా చేస్తారు' అంటూ టాస్క్‌ఫోర్స్ బృందాలను మిల్లర్లు ప్రశ్నించడంతో నివ్వెరపోవడం వారి వంతైంది. అయితే దోషులెవరో నిగ్గు తేల్చేందుకు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజను విచారణ అధికారిగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నియమించినట్లు సమాచారం.

మిల్లర్లే చెప్పడంతో..

జిల్లాలోని పలువురు మిల్లర్లు సీఎంఆర్‌కు సంబంధించి ధాన్యాన్ని పక్కదారి పట్టించిన విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు కొణిజర్ల మండలంలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లుపై దాడులు నిర్వహించాయి. రూ.81 కోట్లకు పైగా విలువైన ధాన్యం, సీఎంఆర్‌ను ఈ మిల్లు యాజమాన్యం ఎగ్గొట్టినట్లు తేలింది. అలాగే మరో నాలుగు మిల్లులు కూడా సీఎంఆర్‌ను పక్కదారి పట్టించినట్లు ఈ బృందాల పరిశీలనలో బయటపడింది. ఎస్ఏఆర్ రైస్ మిల్లులో తనిఖీల సమయాన అధికారుల సహకారం ఉందని టాస్క్‌ఫోర్స్ బృందాలకు స్పష్టత వచ్చింది. అధికారులకు డబ్బు ఇచ్చినట్లు స్వయంగా మిల్లరే టాస్క్‌ఫోర్స్ బృందాల్లోని అధికారులకు చెప్పారు. దీంతో జిల్లాలో అతి తక్కువ సీఎంఆర్ ఇచ్చిన మిల్లులు ఎన్ని, ఇందులో అధికారుల పాత్ర ఏ మేరకు ఉందన్న అంశంపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

కఠిన చర్యలే..

సీఎంఆర్ పక్కదారి పట్టడం, అధికారుల ముడుపుల వ్యవహారంపై అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విచారణ అధికారిగా నియమించినట్లు తెలిసింది. మూడు రోజుల్లో నివేదిక అందనుండగా బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశముంది. ఈ ఐదు మిల్లుల్లో ఎంత సీఎంఆర్ పెండింగ్ పెట్టారు.. పర్యవేక్షించిన అధికారులు, ఉద్యోగులెవరు.. మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కోణంలో విచారణ జరగనుంది. పౌరసరఫరాల సంస్థ ప్రతిష్టను దిగజార్చేలా జరిగిన ముడుపుల వ్యవహారంపై లోతుగా విచారణ చేయనున్నారు. ఆరోపణలు వాస్తవమని తేలితే భవిష్యత్‌లో పౌర సరఫరాల సంస్థలో ఈ తరహా వ్యవహారం చోటు చేసుకుండా సదరు అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

అందిన కాడికి దండుకున్నారా?

ఉమ్మడి జిల్లా, జిల్లాల విభజన తర్వాత పౌరసరఫరాల సంస్థ చరిత్రను పరిశీలిస్తే ఈ స్థాయిలో మిల్లర్లు సీఎంఆర్ ఎగవేయడం, కుంభకోణంపై ఆరోపణలు వచ్చిన దాఖలాలు లేవు. కానీ ఈసారి మాత్రం మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకున్నా వారితో పౌర సరఫరాల సంస్థలోని ముగ్గురు అధికారులు, ఈ వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన మరో అధికారి అందిన కాడికి దండుకున్నారనే ఆరోపణలొస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ బృందాలు భారీ కుంభకోణాన్ని పసిగట్టే వరకు కూడా సంస్థ అధికారులు, సదరు అధికారి నోరు మెదపకుండా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రచారం జరుగుతోంది. అంతేకాక బండారం బయట పడకుండా సీఎంఆర్ నివేదికలను ఇష్టానుసారంగా రూపొందించారనే అపవాదు ఉంది. ఎస్ఏఆర్ రైస్ మిల్లులో సీఎంఆర్‌ను పర్యవేక్షించాల్సిన ఓ డిప్యూటీ తహసీల్దార్ ఇటీవల ఓ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన హయాంలోనే మిల్లు యాజమాన్యం సీఎంఆర్‌ను పక్కదారిని పట్టించినట్లు సమాచారం.

విచారణకు మంత్రి తుమ్మల ఆదేశం

జిల్లాలో సీఎంఆర్ పక్కదారి పట్టిన అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్‌గా పరిగణించారు. అధికారుల అలసత్వం, మిల్లర్ల ఇష్టారాజ్యంతో రూ.కోట్ల విలువైన ధాన్యం గేట్లు దాటడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిల్లర్లు అక్రమాలకు పాల్పడ్డారని, ఇందులో బాధ్యులైన ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పారదర్శక పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.. దుర్వినియోగానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని పేర్కొన్నారు. ధాన్యం అక్రమ రవాణాపై ప్రత్యేక విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ నమోదు చేయాలని మంత్రి తుమ్మల కలెక్టర్‌ను ఆదేశించారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తులు, వినతుల స్వీకరణ



దివ్యాంగుల వద్దకు వచ్చి సమస్యలు వింటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ఫిర్యాదులు, వినతులను వెనువెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి(గ్రీవెన్స్ డే) సందర్భంగా పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు.

పాఠశాలల్లో మంచి వాతావరణం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో పాఠశాల విద్య అభివృద్ధి, రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం, కలెక్టరేట్‌లో వసతులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే కాక మధ్యాహ్న భోజనంపై శ్రద్ధ వహించాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. కాగా, రిటైర్డ్ అయ్యే ఉద్యోగులను గౌరవించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాలో ఉద్యోగ విరమణ చేసే వారికిని కలెక్టరేట్‌లో సన్మానించే ఆనవాయితీ ఈ నెల నుంచి మొదలుపెట్టాలని, అదేరోజు బెనిఫిట్స్ ఉత్తర్వుల ప్రతులు అందించాలని చెప్పారు. ఇక కలెక్టరేట్ వద్ద బస్ స్టాప్ సిద్ధమవుతుండగా, పాలు ఇచ్చే తల్లుల కోసం ప్రత్యేక గది, పిల్లల సంరక్షణ కేంద్రంలో సౌకర్యాలపై సూచనలు చేశారు. అంతేకాక ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేలా కలెక్టరేట్ లో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం రిటైర్డ్ అయిన పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్‌ను కలెక్టర్, అధికారులు సన్మానించారు.

1098పై విస్తృత ప్రచారం

ఖమ్మంవన్‌టౌన్: చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సంబంధించి 1098 నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యాన రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లల అక్రమ రవాణా, వేధింపులు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కోసం పోస్టర్లు రూపొందించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, డి.మధుసూదన్ నాయక్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, డీసీపీఓ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.



బృంద నృత్యం చేస్తున్న విద్యార్థినులు



అమ్మవారి వేషధారణలో విద్యార్థిని నృత్యం

ఉరకలేసిన ఉత్సాహం!

జానపద, శాస్త్రీయ గేయాలకు పోటాపోటీగా యువత చేసిన నృత్యాలతో ఖమ్మంలోని భక్త రామదాసు కళా క్షేత్రంలో సందడి నెలకొంది. జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించగా వివిధ విభాగాల్లో యువత సత్తా చాటారు. ఈ సందర్భంగా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేసిన అధికారులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారి వివరాలు ప్రకటించారు.

– ఖమ్మం రాపర్తినగర్

8లో



కొత్త టీచర్లకు ఆహ్వానం!

- 2024 – డీఎస్సీ ఫలితాలు విడుదల
- నేటి నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన
- ఆపై త్వరలోనే పోస్టింగ్ ఇచ్చే అవకాశం

ఖమ్మం సహకారనగర్: ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీంతో రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆగస్టు నెలలో డీఎస్సీ నిర్వహించగా సోమవారం ఫలితాలను విడుదల చేశారు. ప్రతీ పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయగా సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం త్వరలోనే పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. దీంతో జిల్లాలోని 575ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ఈమేరకు ఉపాధ్యాయుల కొరత తీరి విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని భావిస్తున్నారు. అంతేకాక కొత్త ఉపాధ్యాయులు వస్తే మూతబడిన పాఠశాలలు సైతం వచ్చే విద్యాసంవత్సరం తెరుచుకునే అవకాశముంటుంది.

నేటి నుంచి కౌన్సెలింగ్

డీఎస్సీ ఫలితాలు విడుదల కావడంతో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు సిద్ధమయ్యారు. ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో సర్టిఫికెట్లు పరిశీలించనుండగా ఏర్పాట్లు మొదలయ్యాయి. మంగళవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు పరిశీలన కొనసాగుతుంది. డైరెక్టర్ ఆఫ్ స్కూల్‌ఎడ్యుకేషన్ నుంచి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్ http:schooledu. telangana. gov. in/ ISMS/లో పొందుపర్చారని, ఆయా అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు జిరాక్స్ సెట్లపై గెజిటెట్ అధికారి ధ్రువీకరణతో హాజరు కావాలని వెల్లడించారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలన తుది జాబితా విడుదల చేయనుండగా.. గతంలోనే సబ్జెక్టుల వారీగా ఖాళీ పోస్టులు తేల్చినందున త్వరలోనే కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు.

మొదటి రోజే రిక్కాబజార్‌లో...

డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు మంగళవారం నుంచి పరిశీలించనుండగా 12బృందాలను ఏర్పాటుచేశారు. ఇక జిల్లా పరిశీలకుడిగా మోడల్ స్కూళ్ల అడిషినల్ డైరెక్టర్ శ్రీనివాసాచారిని ప్రభుత్వం నియమించింది.. అలాగే, తొలిరోజైన మంగళవారం రిక్కాబజార్ స్కూల్‌లో సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ఆతర్వాత ఈ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరగనుండడంతో ఎస్‌జీటీలకు రోటరీనగర్ హైస్కూల్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇందిరానగర్ స్కూల్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని నిర్ణయించారు.

బీపీఎం నుంచి టీచర్‌గా...



కల్లూరు : మా అమ్మానాన్న, భర్త ప్రోత్సాహంతోనే జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించా. 2018లో అవనిగడ్డలో కోచింగ్ తీసుకుని డీఎస్సీ రాసినా రాలేదు. ఆతర్వాత అశ్వారావుపేట మండలం అచ్యుతాపురంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు టీచర్‌గా ఎంపికవడం ఆనందంగా ఉంది.

– రెడ్డి మాధురి, జిల్లా మొదటి ర్యాంక్(ఎస్‌జీటీ), చిన్నకోరుకొండి

మా వారి ప్రోత్సాహంతో...



నా భర్త వెంకటేశ్వరరావు కల్లూరు మండలం నారాయణపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనతోపాటు తల్లిదండ్రులు వలసాల నరేంద్ర – అనూష ప్రోత్సాహంతోనే డీఎస్సీలో ర్యాంక్ సాధించా. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

– వలసాల ఉమ, ద్వితీయ ర్యాంక్, కల్లూరు

తండ్రి ఉద్యోగ విరమణ.. కుమారుడు-కోడలికి ఉద్యోగాలు!

మధిర: మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన ఓ వ్యక్తి ఉద్యోగ విరమణ చేసిన రోజే ఆయన కుమారుడు – కోడలు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం విశేషం. మధిర మండలం చిలుకూరుకు చెందిన రావిరాల లక్ష్మణరావు దెందుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం రిటైర్డ్ అయ్యారు. ఇదేరోజు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలు విడుదల చేయగా లక్ష్మణరావు తనయుడు భరత్‌కుమార్ ఎస్‌జీటీ జిల్లా స్థాయిలో 101వ ర్యాంకు, భరత్ భార్య కావ్య 252వ ర్యాంకు సాధించడం ఆ కుటుంబంతో పాటు బంధుమిత్రుల్లో ఆనందాన్ని నింపింది.

ఆ ఇళ్లలో ముందే దసరా..! 8లో



భరత్‌కుమార్ - కావ్య దంపతులు

ఇంకా మానని గాయం..



ఇంకా బురదమయంగానే ఉన్న ఖమ్మంరూరల్ ఎంపీడీఓ కార్యాలయం

- మున్నేటి వరద ముంచెత్తి ఈరోజుకు సరిగ్గా నెల
- ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుతున్న బాధితులు
- కాలనీల్లో వరదపై కొనసాగుతున్న చర్చ
- ఇంకా సాయం అందలేదని పలువురి ఆవేదన

ఖమ్మంమయూరిసెంటర్: ఎగువ ప్రాంతాల్లో ఆగస్టు 31న కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం మీదుగా ప్రవహిస్తున్న మున్నేరుకు సెప్టెంబర్ 1న తెల్లవారుజాము నుంచి వరద రావడం మొదలైంది. అంతకంతకూ వరద పెరిగి ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలాల్లోని అనేక కాలనీలు, గ్రామాలను ముంచెత్తింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇళ్లు మునగడంతో జనాలు సర్వస్వం కోల్పోయారు. ఇది జరిగిన నేటి(మంగళవారం)తో నెల పూర్తవుతుండగా బాధితులు ఇంకా తేరుకోలేకపోతున్నారు. చుట్టుముట్టిన వరదతో బయటకు రాలేక బహుళ అంతస్తుల భవనాలపైకి చేరుకుని దాదాపు 22గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడపడాన్ని గుర్తుచేసుకుంటూ ఆందోళన చెందుతున్నారు.

వెంటాడుతున్న చేదు జ్ఞాపకాలు

మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏ వీధి, కాలనీకి వెళ్లినా తమకు జరిగిన నష్టాన్ని చెప్పుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఊహించని విధంగా ఒక్కసారిగా వరద రావడంతో కట్టుబట్టలతో బయటకు వచ్చామని, వరద తగ్గే వరకు 20 గంటల నుండి 22 గంటల పాటు డాబాలపై బిక్కుబిక్కుమంటూ గడిపామని తెలిపారు. ఎవరి ఇంట్లో ఏమేం కొట్టుకపోయాయి, ఎవరికి ఎంత నష్టం వాటిల్లిందనే చర్చ జరుగుతోంది. సాయం చేసేందుకు వచ్చిన దాతలకు తమ కష్టాన్ని చెప్పుకొని బోరున విలపిస్తున్నారు. అనేక మంది తమ కాలనీలకు ఎవరు వస్తారు.. ఏవం సాయం చేస్తారోనని ఇంకా ఎదురు చూస్తుండడం వారి ఆవేదనను కళ్లకు కడుతోంది.

మొండి గోడలు, కూలిన ఇళ్లు

వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లు, రోడ్లపై బురదను తొలగించినా.. అనేక ప్రాంతాల్లో ఆ మచ్చలు అలాగే మిగిలిపోయాయి. వరద వచ్చి నెల గడిచినా కూలిపోయిన ఇళ్లు, ధ్వంసమై మిగిలిన మొండి గోడలను చూస్తే ఆనాటి విలయాన్ని గుర్తుకు తెచ్చుకుని స్థానికులు వణికిపోతున్నారు. భారీ వరదతో ప్రాణాపాయం జరగకున్నా, రూ.కోట్లలో ఆస్తి నష్టం జరిగిందని చెబుతున్నారు. కొన్నిచోట్ల దెబ్బతిన్న ఇళ్లను మరమ్మతు చేయించుకోగా ఇంకొన్ని చోట్ల మాత్రం మొండిగోడలు, పైకప్పు లేచిపోయిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఆయా ఇళ్ల యజమానులు ఉండేందుకు గూడు కూడా లేక పిలాపాపలతో అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నారు.

సాయం అందలేదని..

వరద బీభత్సం సృష్టించి నెల దాటినా సాయం అందలేదని పలువురు కేఎంసీ, ఖమ్మంరూరల్ ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వందలాది మంది ఖాతాల్లో నగదు పడలేదని, ప్రభుత్వం నుంచి నిత్యావసర కిట్లు కూడా రాలేదని వాపోతున్నారు. ఇక్కడ నివసించని వారికి సాయం అందగా, అద్దె ఇళ్లలో ఉంటున్న తమకు మాత్రం రాలేదని వాపోతున్నారు. పది రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరని చెబుతున్నారు. ఇక విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాల కోసం అధికార యంత్రాంగం సర్వే చేపట్టడంతో పాటు దరఖాస్తులు స్వీకరించినా ఎప్పుడు వస్తాయనే అంశంలో స్పష్టత లేదు.



గోడలు మాత్రమే మిగిలిన ఇంటి వద్ద నిలబడిన ఈమె పేరు కాశిపాక శిరీష. ఖమ్మం వెంకటేశ్వరనగర్‌లో అద్దె ఇంట్లో ఆమె కుటుంబంతో ఉంటుండగా వరదలతో ఇంటి పైకప్పుతో పాటు సామగ్రి కొట్టుకుపోయింది. అద్దె ఇంట్లో ఉన్నామనే కారణంతో సర్వేలో పేర్లు రాసుకోలేదని వాపోతోంది. ఎవరి వద్దకు వెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రభుత్వ సాయం అందకపోగా.. నిత్యావసర కిట్లు కూడా ఇవ్వలేదని కనిపించిన వారికల్లా చెప్పుకుని కన్నీరు పెడుతోంది.

బిక్కుబిక్కుమంటూ గడిపాం..



గత నెల 1న ఉదయం వరద చుట్టుముట్టడంతో 10, 15 కుటుంబాలకు చెందిన 30మందిమి భవనం పైకి వెళ్లాం. మర్నాడు ఉదయం వరకు అక్కడే గడిపాం. ఇంటి యజమాని ఇచ్చిన బియ్యం వండుకుని తిన్నాం. ఆ రోజు గుర్తుకొస్తేనే వణుకొస్తోంది.

– ధరావత్ దేవ్లా - జ్యోతి, వెంకటేశ్వరనగర్, ఖమ్మం

నగదు జమ కాలేదు..



వరద తగ్గాక అధికారులు వివరాలు తీసుకెళ్లారు. నెల గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చే నగదు సాయం ఖాతాల్లో జమ కాలేదు. మా కాలనీలోని 15ఇళ్లలో ఇద్దరికే సాయం అందింది. ప్రభుత్వం కిట్లు కూడా ఇవ్వలేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తే పట్టించుకోవట్లేదు.

– పసుమర్తి కల్పన, కేబీఆర్ నగర్, ఖమ్మంరూరల్

క్లుప్తంగా

రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సన్మానం



సన్మానం అందుకున్న వారితో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు బాధ్యయుతంగా విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. ఈమేరకు ఎస్ఐలు ఉస్మాన్‌అలీ, వీరభద్రరావు, ఏఎస్ఐ అఫ్జల్, హెడ్ కానిస్టేబల్ కామేశ్వరరావు, హోంగార్డు ఆఫీసర్లు గౌస్, మౌలాలీ, కోటేశ్వరరావుని సన్మానించగా అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఆర్ఐలు కామరాజు, సురేష్‌తో పాటు వెంకటేశ్వర్లు, రఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

50 పోస్టులకు ఏడుగురే హాజరు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీనియర్ రెసిడెంట్(ఎస్ఆర్) పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే, కాంట్రాక్టు ప్రాతిపదికన 50 పోస్టులు భర్తీ చేయనుండగా కేవలం ఏడుగురే హాజరయ్యారు. కాగా, వచ్చిన వారంతా ఇంటర్వ్యూలో ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. మరో మారు నోటిఫికేషన్ ఇచ్చి మిగతా పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూల్లో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: టీజీ డీఈఈసీఈటీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు)లో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో విడతగా మంగళవారం సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో పాటు బోనఫైడ్, తాజాగా తీసుకున్న కులధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కూసుమంచి: మండలంలోని పాలేరులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని(50) వ్యక్తి మృతి చెందాడు. స్థానిక చెక్‌పోస్ట్ సమీపాన నడిచి వెళ్తున్న వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని నేలకొండపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అక్కడ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

రుణాల పేరుతో ఆర్పీ అక్రమాలు

- మూతబడిన ఎస్‌హెచ్‌జీల్లో బినామీ సభ్యులు
- ఇతర బ్యాంక్ నుండి ఖాతా మారుస్తున్నట్లు బ్యాంకర్లకు బురిడీ
- రుణం మంజూరుతో ఆరా తీయగా వెలుగుచూసిన మోసం



మెప్మా, బ్యాంకు అధికారుల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇప్పించే ఓ రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) బ్యాంక్‌ను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించి పట్టుపడింది. మనుగడలో లేని గ్రూపులను ఎంచుకుని బినామీలను సభ్యులుగా చేర్చి వారు పాత సభ్యులేనని ఖాతాను మాత్రం ఇంకో బ్యాంకు నుంచి మారుస్తున్నట్లు బ్యాంకర్లను నమ్మించే ప్రయత్నం చేసింది. ఇదంతా నమ్మిన అధికారులు రుణం మంజూరు చేసి లీడర్ ఖాతాలో జమ చేశారు. ఇదేమిటని లీడర్ ఆరా తీయడంతో వ్యవహారం బయటపడగా బ్యాంకర్లు అప్రమత్తం కావడంతో రూ.కోటి వరకు నగదు పక్కదారి పట్టకుండా అడ్డుకోగలిగారు.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఆర్పీ..

ఖమ్మం త్రీటౌన్ ప్రాంతానికి చెందిన మహాలక్ష్మి, జై గణేష్ సంఘాలతోపాటు మరో మూడు సంఘాలు మనుగడలో లేవు. చాన్నాళ్ల క్రితం సభ్యులు వైదొలిగారు. మనుగడలో లేని ఈ ఐదు సంఘాలను గుర్తించిన 33వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన ఆర్పీ.. ఎంపిక చేసిన 50 మంది మహిళలకు రూ.10 వేల చొప్పున రుణం ఇప్పిస్తామని, తిరిగి చెల్లించే అవసరం లేకపోగా రూ.వెయ్యి చొప్పున కమీషన్ ఇస్తే చాలని నమ్మబలికింది.

బ్యాంకర్‌ను కలిసి..

ప్రణాళికప్రకారం సదరు ఆర్పీ.. గతంలో గ్రూపులు ఉన్న బ్యాంక్‌కు కాకుండా మరో బ్యాంక్‌కు వెళ్లి ఐదు సంఘాలు ఖాతాలను ఇక్కడ ప్రారంభించాలని.. తద్వారా రుణం ఇవ్వాలని కోరింది. దీంతో బ్యాంకర్లు గత స్టేట్‌మెంట్లను చూసి సమ్మతించాక సంఘానికి రూ.20 లక్షల చొప్పున రుణం మంజూరుకు అంగీకరించారు. జై గణేష్ గ్రూపు పేరుతో మొదటి, రెండో లీడర్ల పేరిట జాయింట్ అకౌంట్ తీశాక రుణం కోరుతూ తీర్మానాన్ని బ్యాంకర్లకు అందజేసింది. దీంతో ఖాతాలో రూ.19,96,342 నగదు జమ చేయగా రూ.10వేలు అని చెప్పినా ఇంత నగదు జమ కావడంతో లీడర్లు అవాక్కయ్యారు. అయితే, కొత్త గ్రూపులు రుణం కోసం వచ్చినప్పుడు సభ్యులతో నేరుగా మాట్లాడి తీర్మానాలు, సంతకాలు పరిశీలించాల్సిన అధికారులు పెద్ద మొత్తం రుణం మంజూరు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకర్లు, ఆర్పీ కుమ్మక్కై రూ.కోటి వరకు కాజేసేందుకు పన్నాగం పన్నినట్లు చర్చ జరుగుతోంది.

కేఎంసీలో ఆందోళన..

బ్యాంక్ నుంచి రూ.19 లక్షలకు పైగా నగదు జమ కావడంతో గ్రూపు లీడర్లు, సభ్యులు బ్యాంక్‌కు వెళ్లి నగదును ఫ్రీజ్ చేయించడమే కాక సోమవారం కేఎంసీ కార్యాలయానికి చేరుకుని మెప్మా విభాగంలో ఆందోళనకు దిగారు. ఆర్పీని కార్యాలయానికి పిలిపించి తమతో సంతకాలు పెట్టించుకున్న తెల్ల కాగితాలు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆర్పీతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఈ స్కామ్‌లో ఉన్నారని, బ్యాంకర్లు కూడా తమను చూడకుండా రుణం ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విడిచి పెట్టేది లేదని ఆర్పీని బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ అంశంపై మెప్మా అధికారులను వివరణ కోరగా.. రుణం మంజూరు కోసం కార్యాలయ ఉద్యోగులు ఏ పత్రాలపై సంతకాలు చేయలేదని తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన ఆర్పీపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉరకలేసిన ఉత్సాహం!

- పోటాపోటీగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు
- స్వామి వివేకానంద జయంతోత్సవాల్లో భాగంగా నిర్వహణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి



బృంద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖమ్మం రాపర్తినగర్: యువతలో ఉత్సాహం ఉరకలేసింది... జానపద, శాస్త్రీయ గేయాలకు పోటాపోటీగా నృత్యాలు చేసిన యువత.. ఇతర విభాగాల్లోను ప్రతిభ కనబరిచారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళా క్షేత్రంలో స్వామి వివేకానంద జయంతోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 950 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. జానపద నృత్యంలో 60 గ్రూప్‌లు, జానపద గేయాలకు 30 గ్రూప్‌లు, సైన్స్ మేళాకు పది గ్రూప్‌లు పాల్గొనగా.. వక్తృత్వ పోటీలకు 40 మంది, వ్యాసరచన పోటీలకు 50 మంది యువత హాజరయ్యారు. ఈ మేరకు పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీఐఈఓ రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ ఎం.డి.గౌస్ పాషా, జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు కె.ఉమాశంకర్‌తో పాటు రామిరెడ్డి, వివిధ సంఘాల బాధ్యులు జక్కుల వెంకటరమణ, వి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలిలా ఉన్నాయి. జానపద నృత్యం(సోలో)లో వై.మధు (ఖమ్మం), రాజేశ్వరి(టీటీడబ్ల్యూఆర్‌డీసీ), గేయాలు(సోలో)లో రాజేశ్వరి, గంగాధర్, జానపద నృత్యంలో డి.దివ్య(వైరా), వి.నవ్య(ఖమ్మం), జానపద నృత్యం(గ్రూప్)లో హార్వెస్ట్ జూనియర్ కళాశాల, టీజీడబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం, వ్యాసరచన పోటీల్లో వి.సింధు(ఏఎస్ఆర్ కాలేజీ), ఆర్.భవిజ్ఞ(జీజేసీ బాలికలు, ఖమ్మం), క్రాఫ్ట్‌లో సీహెచ్.శ్రీనియ(హార్వెస్ట్ కాలేజీ), సీహెచ్.రమ్య(వైరా), పోస్టర్ పెయింటింగ్‌లో టి.లక్ష్మీప్రసన్న(రఘునాథ పాలెం), టి.భానుప్రసాద్(తిరుమలాయపాలెం) వరుసగా మొదటి రెండుస్థానాల్లో నిలవగా సైన్స్ మేళాలో ఎస్‌బీఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈమేరకు విజేతలకు డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

సీఎంతోనే మాదిగ జాతికి న్యాయం



మాట్లాడుతున్న పిడమర్తి రవి, పక్కన సోమచంద్రశేఖర్ తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఉన్న మంద కృష్ణ మాదిగతో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి నడుద్దామని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి, తెలంగాణ మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈనెల 19న హైదరాబాద్‌లో ప్రారంభమైన మాదిగల మేలుకొలుపు యాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. ఈసందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ చేస్తేనే మాదిగ జాతికి న్యాయం జరుగుతుందని, ఇది కేవలం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే వర్గీకరణ అమలుచేస్తామని ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్‌లో 45 ఏళ్లుగా మాదిగలకు అన్యాయం జరుగుతుండగా, దళితుల్లో 75 శాతం ఉన్న మాదిగలకే చట్టసభల్లో టికెట్లు, నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. తెలంగాణ మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీద గోవిందరావు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మట్టె గురుమూర్తితో పాటు వివిధ సంఘాల బాధ్యులు మైసా ఉపేందర్, గజ్జెల్లి మల్లికార్జున్, జోగారావు, నంద్ర ఉపేందర్, ఇరుగు శివ, చిరపాక వినయ్, సతీష్, ఉదయ్, కాంపటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించండి

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ



క్రీడాకారులతో డీఈఓ సోమశేఖరశర్మ, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని.. తద్వారా తప్పులను బేరీజు వేసుకుని భవిష్యత్‌లో విజయానికి బాటలు పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం రెండో రోజుకు చేరగా ఆయన మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి కలిగి, నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి తీర్చిదిద్దాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే ఔత్సాహిక క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇస్తే రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎగుగుతారని తెలిపారు. జిల్లాలోని ఆరు జోన్ల నుంచి అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలు 432 మంది హాజరు కాగా ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, రిటైర్డ్ పీడీ సయ్యద్ ఉస్మాన్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.గోవిందరెడ్డి, పీడీలు పాల్గొన్నారు. కాగా, ఈ పోటీలు మంగళవారం ముగియనున్నాయి.

విజేతలు వీరే

జిల్లాస్థాయి పాఠశాలల క్రీడల్లో భాగంగా రెండో రోజు విజేతలగా వివరాలిలా ఉన్నాయి. బాలికల విభాగంలో అండర్-17 నుంచి మధిర, ఖమ్మం నార్త్ జోన్ జట్లు, వాలీబాల్‌లో ఖమ్మం నార్త్ జోన్, సత్తుపల్లి, కబడ్డీలో ఖమ్మం నార్త్, మధిర, అండర్-14 బాలికల కబడ్డీలో మధిర, సత్తుపల్లి, ఖో-ఖోలో మధిర, ఖమ్మం సౌత్, వాలీబాల్‌లో ఖమ్మం నార్త్, సత్తుపల్లి జట్లు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నాయి.

ఉద్యోగుల సమస్యలపై అలసత్వం తగదు

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

కల్లూరు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం తగదని.. ఇకనైనా పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు, పీఆర్సీ ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. కల్లూరులోని ప్రభుత్వ కళాశాలలో మండల అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే రెండు డీఏలు, ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని ప్రకటించినా విస్మరించారన్నారు. అంతేకాక పెండింగ్ బిల్లుల మంజూరు, సీపీఎస్ రద్దు, 317 జీఓపై స్పందించకపోవడం సరికాదన్నారు. ఫలితంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతుందనే అంశాన్ని గుర్తించి తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు ఎస్.సతీష్, కొడిశాన విజయకుమార్, వీ.వీ.రామారావు, నెల్లూరి వీరబాబు, బి.సుధాకర్, ఎం రాజేశ్వరరావు, అమరనాథ్, సుధీర్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పురుషోత్తం, సుసాత, వసంత, కృష్ణవేణి, సోమ్లానాయక్, రాంబాబు, అమర్లపూడి చక్రవర్తి పాల్గొన్నారు.

624 కిలోల గంజాయి దహనం

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని సోమవారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఈమేరకు 624కిలోల గంజాయిని అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ ఆధ్వర్యాన జిల్లాలోని మంచుకొండ అటవీ ప్రాంతంలో నిర్వీర్యం(దహనం) చేశారు. సీఐలు ఉదయ్‌కుమార్, జనార్దన్, ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

వైరా: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు పడింది. వైరా మండలం పాలడుగు జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీంతో ఆయనపై పోక్సో, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈమేరకు ఆయనను పోలీసులు మధిర కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. దీంతో శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్జేడీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

జీటెక్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

వైరా: కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామ సమీపాన అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురి నుంచి రూ.2 లక్షలు విలువైన 8.5 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పల్లిపాడు సమీపంలో ఎక్సైజ్ పోలీసులు ఆర్టీసీ బస్సులను తనిఖీ చేస్తుండగా భద్రాచలం నుండి ఖమ్మం వెళ్లే బస్సు నుంచి చంద్రబాబు, అఫ్రోజ్, అజీజ్ కిందకు దిగారు. ఈమేరకు కొంత దూరం వెళ్లిన వారిని గుర్తించి తనిఖీ చేయగా గంజాయి లభించింది. కాగా, నిందితులు ముగ్గురు ఏపీలోని నెల్లూరుకు చెందిన బీటెక్ విద్యార్థులుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మమత, ఎస్సై సాయిరాం తెలిపారు.

ఓవరాల్ చాంపియన్‌గా 'ఖమ్మం'

ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడలు



విజేతకు పతకం అందిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

చుంచుపల్లి: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న అటవీ శాఖ జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన అటవీ ఉద్యోగులు పాల్గొన్నారు. జోనల్ క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం జట్టు నిలిచింది. అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, షటిల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించగా.. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఖమ్మం టీంకు సీసీఎఫ్ డి.భీమానాయక్ ట్రోఫీ అందజేశారు. అలాగే, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, సిబ్బందిని సత్కరించారు. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్ జిల్లాల డీఎఫ్ఓలు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్, డీసీఎఫ్‌లు పి.కృష్ణమాచార్య, కె.దామోదర్‌రెడ్డి, ఏసీఎఫ్‌లు ఎస్.సుజాత, సయ్యద్ మక్సూద్, బి.బాబు, వి.చంద్రశేఖర్, వి.మంజుల, యూ.కోటేశ్వరరావు, సందీప్‌రెడ్డి, భాగ్యానాయక్, మూర్తి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇళ్లలో ముందే దసరా..!

- డీఎస్సీ ఫలితాల విడుదలతో సంబురాలు
- ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో ఆనందం
- త్వరలోనే కొలువుల్లో చేరనున్న 575మంది..

దసరా పండుగ జరుపుకోవడానికి ఇంకా పది రోజులపైగానే సమయం ఉంది! కానీ జిల్లాలోని పలువురి ఇళ్లలో అప్పుడే విజయదశమి వెలుగులు నిండాయి. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఆ ఇళ్లలోని అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడమే ఆ సంతోషానికి కారణం! జిల్లాలో 575 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించగా.. 1:3 నిష్పత్తిలో వివరాలను వెల్లడించారు. వీరి సర్టిఫికెట్లను మంగళవారం నుంచి పరిశీలించనుండగా.. త్వరలోనే ఎంపిక జాబితా ప్రకటిస్తారు. ఈ సందర్భంగా జిల్లాలో డీఎస్సీకి అర్హత సాధించిన పలువురి వివరాలు...

– చింతకాని / తల్లాడ / ముదిగొండ / తిరుమలాయపాలెం

ప్రొద్దుటూరు నుంచి ఇద్దరు



ఈలప్రోలు సునీత



ఈలప్రోలు నరేష్

డీఎస్సీ ఫలితాల్లో చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి ఈలప్రోలు సునీత ప్రత్యేక విద్య విభాగంలో ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయి 3వ ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె తల్లిదండ్రులు కృష్ణ – సావిత్రి, భర్త వీరబాబు ప్రోత్సాహంతో విజయం సాధించినట్లు తెలిపింది. సునీత విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే కొనసాగగా డీఎస్సీలో జిల్లా స్థాయి 3వ ర్యాంక్ సాధించడం అభినందనలు వెల్లువెత్తాయి. ప్రొద్దుటూరుకే చెందిన ఈలప్రోలు నరేష్ సైతం ప్రత్యేక విద్య ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో 11వ ర్యాంక్ సాధించాడు. ఈసందర్భంగా ఆయనను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఒకే కాలేజీ విద్యార్థులు

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని అప్పలనరసింహాపురం నుంచి ముగ్గురు ర్యాంకులు సాధించారు. గ్రామానికి చెందిన కందుల సురేష్, గూటి వీరబాబు, కొండపల్లి సత్యనారాయణ వరుసగా 3, 5, 6వ ర్యాంకులు సాధించారు. ఈ ముగ్గురు సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ కేఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేయడం విశేషం.

మొదటి, రెండు ర్యాంకులు కల్లూరు మండలానికే..

కల్లూరు: డీఎస్సీ ఫలితాల్లో కల్లూరు మండలం నుంచి పలువురు ర్యాంకులు సాధించారు. చిన్నకోరుకొండికి చెందిన రెడ్డి మాధురి జిల్లా స్థాయిలో 87.27 మార్కులు సాధించి ఎస్జీటీ విభాగంలో మొదటి ర్యాంకు, కల్లూరుకు చెందిన వలసాల ఉమ 84.17 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించడం విశేషం. ఇందులో మాధురి భర్త శివకృష్ణ భద్రాద్రి జిల్లాలో టీచర్‌గా ఎంపికయ్యారు. అలాగే, చిన్నకోరుకొండికి చెందిన గోపీకృష్ణ ఎస్జీటీలో 6వ ర్యాంకు, కల్లూరుకు చెందిన ముప్పిడి నవ్య, చిన్నకోరుకొండికి చెందిన నామా గోపి, లక్ష్మాతండాకు చెందిన యుగంధర్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ర్యాంకులు సాధించారు. ఇక చిన్నకోరుకొండికి చెందిన మూలగండ్ల శివకృష్ణ, మూలగండ్ల రాజ్యలక్ష్మి భద్రాద్రి జిల్లాలో ఎస్జీటీలుగా ఎంపికయ్యారు.



గోకినపల్లి పవిత్ర

పవిత్ర.. ప్రతిభ

తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడుకు చెందిన గోకినపల్లి పవిత్ర ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయి 14వ ర్యాంకు సాధించి పోస్టుకు అర్హత సాధించింది. గ్రామానికి చెందిన గోకినపల్లి వెంకన్న, ఉపేంద్రమ్మకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో రజక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న వెంకన్న పిల్లలను చదివించగా పవిత్ర తెట్టెలపాడు జెడ్పీటీహెచ్ఎస్‌లో పదో తరగతి, ఆతర్వాత ఖమ్మంలో ఇంటర్, బీఈడీ పూర్తి చేసింది. ఇప్పుడు ఉపాధ్యాయురాలిగా ఎంపికవడంతో ఆమె కుటుంబంలో ఆనందం నెలకొంది.

దంపతులకు ఉద్యోగాలు..



అలవాల రామకృష్ణ - అనూష

ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన అలవాల రామకృష్ణ, అనూష దంపతులు డీఎస్సీలో ర్యాంకులు సాధించారు. అనూష 73.27మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 80వ ర్యాంకు, రామకృష్ణ 67.8మార్కులతో 210 ర్యాంకు సాధించాడు. ఇద్దరు ఇంటి వద్దే డీఎస్సీకి సిద్ధమై ర్యాంకులు సాధించడం విశేషం. దంపతులిద్దరు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిభ చాటిన వెన్నెల, ప్రియాంక



వెన్నెల



ప్రియాంక

కూసుమంచి మండలంలోని నేలపట్లకు చెందిన కన్నెబోయిన నాగేశ్వరరావు – భాగ్యలక్ష్మి కుమార్తె వెన్నెల ప్రతిభ చాటింది. ఎస్జీటీ విభాగంలో 75.09 మార్కులతో జిల్లా స్థాయి 37వ ర్యాంకు సాధించింది. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆమె కష్టపడి చదివి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికవడంపై పలువురు అభినందిస్తున్నారు. ఇదేమండలం జీళ్లచెరువుకు చెందిన మండవ ప్రియాంక ఎస్జీటీ విభాగంలో 79.17 మార్కులతో 11వ ర్యాంకు సాధించింది. ప్రియాంక తండ్రి హరికృష్ణ అటవీశాఖలో ఉద్యోగి. కాగా, ప్రియాంకకు 2019లో ముదిగొండ మండలం వల్లబికి చెందిన కానిస్టేబుల్ బెల్లంకొండ సతీష్‌తో వివాహం జరిగింది. వివాహమయ్యాక భర్త ప్రోత్సాహంతో బీఈడీ పూర్తి చేసిన ఆమె సొంతంగా డీఎస్సీకి సిద్ధమై ఉద్యోగం సాధించడం విశేషం.

టీచర్‌గా గ్రామ కార్యదర్శి!



తిరుపతిరెడ్డి

తల్లాడ: తల్లాడ మండలంలో ఆరున్నరేళ్ల పాటు గ్రామ కార్యదర్శిగా పనిచేసిన శీలం తిరుపతిరెడ్డి డీఎస్సీలో జిల్లా స్థాయిలో సత్తా చాటారు. వైరా మండలం ఖానాపురానికి చెందిన తిరుపతిరెడ్డి 2015లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలంలో రెండున్నరేళ్లు,తల్లాడ మండలంలో ఆరున్నరేళ్లుగా పనిచేసి ఇప్పుడు కామేపల్లి మండలం గోవింద్రాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఓ పక్క విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ రాసిన ఆయన ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం జిల్లా స్థాయి మొదటి ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంక్ సాధించడం విశేషం. ఆయనను ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కె.శ్రీదేవి తదితరులు అభినందించారు.

మరిన్ని ఏపీ వార్తలకు
ఈ క్యూఆర్ కోడ్‌ను
స్కాన్ చేయండి



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఒంటరి పెద్దలకు పెళ్లి.. మనమే చేద్దాం మళ్లీ..

■ పంజగుట్టకు చెందిన సత్యనారాయణకు ముగ్గురు కూతుళ్లు. భార్య కేన్సర్‌తో చనిపోగా కూతుళ్లను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కూతుళ్లు ఇంట్లో ఉన్నంతకాలం ఒంటరితనం అంటే ఏమిటో తెలియని ఆయన.. వారంతా అత్తారిళ్లకు వెళ్లిపోయాక కొన్ని నెలల్లోనే మానసికంగా కుంగిపోయారు. తండ్రి పరిస్థితి చూసి తల్లడిల్లిన కూతుళ్లు.. తండ్రికి తగ్గ జోడీని తెచ్చి పెళ్లి చేశారు. ఇప్పుడు సత్యనారాయణ భార్యతో కలిసి హాయిగా శేష జీవితం వెళ్లదీస్తున్నారు.

■ అమెరికాలో నివసించే ఓ వివాహిత హైదరాబాద్‌లో ఉండే తన సోదరుడు చనిపోయాక ఒంటరిగా ఉండలేకపోతున్న తల్లి కష్టాలు చూసి చలించిపోయింది. వెంటనే నగరానికి వచ్చి దగ్గర బంధువులతో మాట్లాడటంతోపాటు ఎలాగోలా తల్లిని ఒప్పించి మరో పెళ్లి చేసింది. వారికి కావాల్సినవన్నీ సిద్ధం చేసి మళ్లీ అమెరికా వెళ్లిపోయింది.

ఈ రెండు ఉదంతాలు నవతరం పిల్లల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలను దెబ్బతీసిన న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఆ తర్వాత సీనియర్ సిటిజన్స్‌కు వృద్ధాశ్రమాలనే మలి మజిలీలుగా మార్చాయి. అయితే ఇటీవల ఆ తరహా ఆలోచనల నుంచి ఇతరత్రా పరిష్కారాలను వెదుకుతున్నారు.. అందులో భాగంగానే పెద్దల పెళ్లిళ్లు ఊపందుకుంటున్నాయి. ఈ ట్రెండ్ అనేక మంది ఒంటరి తల్లులకు జంటను తెచ్చిపెడుతోంది. తండ్రికి మళ్లీ పెళ్లి చేయడం ద్వారా ఆయన బాగోగులు దగ్గరుండి చూసుకోలేకపోతున్నామనే గిల్టీనెస్ పోగొట్టుకోవడంతోపాటు మరో ఒంటరి మహిళకు తోడు అందించామనే తృప్తి కూడా పొందుతున్నామని సత్యనారాయణ కుమార్తెలు 'సాక్షి'కి చెప్పారు.



వృద్ధాప్యంలో శాపంగా మారే ఒంటరితనానికి పెళ్లి/లివిన్ మించిన పరిష్కారమార్గం లేదని అర్థం చేసుకొని 14 ఏళ్ల క్రితం మా సంస్థను ప్రారంభించాం. ఇప్పటివరకు మేము కొన్ని వేల మంది ఒంటరి వృద్ధుల జీవితాల్లో తిరిగి ఆనందాన్ని తీసుకురాగలిగామని గర్వంగా చెప్పగలను.

- రాజేశ్వరి, తోడు-నీడ సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ

ఎలాంటి ఆధారాల్లేవ్



చంద్రబాబు 'కొవ్వు' ప్రకటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని సీఎం ఎలా చెబుతారు?

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ ఆరోపణల విషయంలో వాస్తవాలు నిర్ధారణ కాక ముందే కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రకటనలు చేయడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని చెప్పేందుకు ముఖ్యమంత్రి వద్ద ఏం ఆధారాలున్నాయని సూటిగా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ప్రెస్ ముందు అలా ఎలా మాట్లాడతారని నిలదీసింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కి పంపించేశామని, అసలు ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనే లేదని టీటీడీ ఈవో చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేసింది. మరి అందుకు విరుద్ధంగా లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని ముఖ్యమంత్రి రాజకీయ ప్రకటనలు ఎలా చేస్తారని విస్మయం వ్యక్తం చేసింది. అసలు దేని ఆధారంగా నెయ్యి కల్తీ అయినట్లు చెబుతున్నారు? లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఆధారాలు ఏమిటి? అని ప్రశ్నించింది. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒక వైపు దర్యాప్తు కొనసాగుతుండగా మరోవైపు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనలు చేయడం వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు ప్రభావితం అవుతాయని తేల్చి చెప్పింది. 'కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి..!' అని సీఎం చంద్రబాబు తదితరులను దృష్టిలో పెట్టుకుని ఘాటుగా వ్యాఖ్యానించింది. నెయ్యి కల్తీ జరిగిందంటూ రిపోర్టు ఇచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) తన నివేదిక తప్పు కావొచ్చునని స్పష్టంగా పేర్కొందని ప్రస్తావించింది. నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం ప్రజల్లోకి వెళ్లింది గానీ తన నివేదికలో తప్పులు ఉండవచ్చని ఎన్‌డీడీబీ స్వయంగా చెప్పిన విషయం మాత్రం ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని వ్యాఖ్యానించింది. కల్తీపై ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికపై సెకండ్ ఒపీనియన్ (రెండో అభిప్రాయం) ఎందుకు తీసుకోలేదని టీటీడీని ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ ఒక్కటే అత్యున్నత ల్యాబ్ కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయని టీటీడీకి గుర్తు చేసింది. ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టత లోపించిందని పేర్కొంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై దర్యాప్తు జరగాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే దర్యాప్తు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థ ద్వారా దర్యాప్తు చేయాలా? అనే విషయంపై తమకు సహకరించాలని సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబర్ 3కి వాయిదా వేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెయ్యి కల్తీకి సంబంధించి ప్రకటనలు చేసే విషయంలో నియంత్రణ పాటించేలా మీ క్లయింట్‌లకు (రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఈవో) చెప్పాలని టీటీడీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకి ధర్మాసనం స్పష్టం చేసింది.

మా ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి..

తమ ప్రశ్నలకు లూథ్రా సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేస్తుండటంతో ధర్మాసనం జోక్యం చేసుకుంది. తమ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. 'లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. ముఖ్యమంత్రి ప్రకటనకు విరుద్ధంగా టీటీడీ ఈవో ప్రకటన ఉంది. కల్తీ నెయ్యి విషయంలో మీ (టీటీడీ) వైఖరి చాలా స్పష్టంగా ఉంది. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలకు ఎలాంటి ఆధారాల్లేవ్. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు...' అని ధర్మాసనం ఘాటుగా స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తునకు ముందే ముఖ్యమంత్రి ప్రకటనలు చేశారని లూథ్రా తెలిపారు. సిట్ ఏర్పాటు తరువాత మాట్లాడలేదన్నారు. అసలు ఎంత మంది కాంట్రాక్టర్ల నుంచి నెయ్యిని సేకరిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఐదుగురు కాంట్రాక్టర్ల వద్ద నుంచని లూథ్రా పేర్కొనడంతో.. వారి నుంచి సేకరించిన నెయ్యి మొత్తాన్ని కలిపేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కలిపేస్తామని లూథ్రా బదులివ్వడంతో మరి ఎవరు సరఫరా చేసిన నెయ్యి కల్తీ అయిందో ఎలా నిర్ధారిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. మొత్తం నెయ్యి నుంచి కల్తీ నెయ్యిని ఎలా వేరు చేస్తారని ప్రశ్నించింది. దీనికి లూథ్రా నేరుగా సమాధానం ఇవ్వకుండా.. గత 50 ఏళ్లుగా స్వామి ప్రసాదాల కోసం కర్ణాటక ప్రభుత్వానికి చెందిన నందిని నెయ్యిని ఉపయోగిస్తూ వచ్చామని, గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టర్ మారారని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలోనే నెయ్యి నాణ్యతను పరిశీలించామన్నారు. దీంతో కల్తీ వ్యవహారం బయటపడిందన్నారు. అయితే ఎన్‌డీడీబీ నివేదికలో అది తప్పు అయ్యే అవకాశం కూడా ఉందని స్పష్టంగా పేర్కొన్నారని, అలాంటప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ చాలా పేరున్న ల్యాబ్ అని లూథ్రా చెప్పగా.. అది ఒక్కటే కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు చాలానే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో దానినే కొనసాగించాలా? లేక దర్యాప్తును స్వతంత్ర సంస్థకు అప్పగించాలా? అనే విషయంపై చెప్పాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 3న మధ్యాహ్నం 3.30 గంటలకు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు...

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని అభ్యర్థిస్తూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ఇతర రాష్ట్రాలకు చెందిన సంపత్, శ్రీధర్, సురేష్ చవంకే వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు వ్యాజ్యాలపై జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మధ్యాహ్నం విచారణ జరిపింది. పిటిషనర్ సుబ్రమణియన్ స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్‌రావు, సంపత్, శ్రీధర్ తరఫున రాఘవ్ అవస్థీ, సురేష్ చవంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

బాబు ప్రకటనతో నిష్పాక్షిక దర్యాప్తు సాధ్యమేనా?

ముందుగా రాజశేఖర్ రావు వాదనలు వినిపిస్తూ.. 'తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు రాజకీయ ప్రకటన చేశారు. అయితే టీటీడీ ఈవో ఆ నెయ్యిని అసలు లడ్డూ తయారీలో ఉపయోగించలేదని పత్రికా ముఖంగా చెప్పారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ముఖ్యమంత్రి లాంటి వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకటనలు చేస్తే దాని పర్యవసానాలు దారుణంగా ఉంటాయి. అవి ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. సీఎం ప్రకటనకు భిన్నంగా టీటీడీ ఈవో ప్రకటనలు ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పర్యవేక్షణతో కూడిన విచారణ అవసరం. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో దర్యాప్తు నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు సాధ్యమేనా? ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ జోక్యాన్ని నిలువరించాలి. మా వ్యాజ్యంలో పలు కీలక ప్రశ్నలను వ్యక్తం చేశాం' అని నివేదించారు.

ఆ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదు...

అనంతరం ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని సమర్థించేందుకే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. స్వామి, వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాల్లోని అంశాలు ఒకే రకంగా ఉన్నాయన్నారు. నెయ్యి సరఫరాదారులకు టీటీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అనంతరం టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ కల్తీ నెయ్యిని పరీక్షల నిమిత్తం ప్రఖ్యాత ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపామన్నారు. జూన్ నుంచి జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీడీబీకి పంపలేదన్నారు. జూలై 6, జూలై 12న సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లనే ఎన్‌డీడీబీకి పంపామని లూథ్రా వెల్లడించారు.

నివేదిక జూలైలో వస్తే సీఎం సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారు..?

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రశ్నల వర్షం కురిపించింది. ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడినట్లని ప్రశ్నించింది. జూలైలో వచ్చిన నివేదికపై అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? ఈ వ్యవహారంలో ప్రెస్ ముందుకెళ్లాల్సిన అవసరం ఏముంది? ముఖ్యమంత్రి స్వయంగా దర్యాప్తునకు ఆదేశించినప్పుడు మళ్లీ ప్రెస్ ముందుకు వెళ్లడం ఏమిటి? నెయ్యిలో జంతు కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అసలు ఈ ప్రకటన చేయడానికి ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏమిటి? లడ్డూల తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతున్నప్పుడు ఆ లడ్డూలను పరీక్షల నిమిత్తం ఎందుకు పంపలేదు? ప్రెస్ ముందుకు వెళ్లే ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని మీరు (సీఎం) భావించలేదా? జంతు కొవ్వు వాడారంటూ చేసిన ప్రకటన కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని తెలియదా? ప్రెస్ ముందుకెళ్లి ప్రకటనలు ఎందుకు చేయాలి? దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. దర్యాప్తు జరుగుతుండగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు అలాంటి ప్రకటనలు చేయవచ్చా? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ ఆవరణలో మంగళవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 63034 08458 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

4న సీనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్లను ఈనెల 4న ఎంపిక చేయనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయని వెల్లడించారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటల కల్లా రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లు 9వ తేదీ నుంచి రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఆయన వెల్లడించారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

భద్రాచలం: గోదావరి వరదల సమయాన వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కమాండర్ ముఖేష్ కుమార్ సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో సోమవారం వివిధ ప్రాంతాల మత్స్యకారులు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు వరద వస్తే లైఫ్ జాకెట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. వాగులు పొంగినప్పుడు దాటొద్దని, తప్పనిసరైతే లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. ఆ తర్వాత గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. అనంతరం గోదావరి ఒడ్డున డెమో ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ డీఎస్‌ఓలు ఇమజ్, కోటేశ్వరరావు, మంగరాజు, నరేందర్ పాల్గొన్నారు.

పదహారేళ్ల కల... నెరవేరిన వేళ

- ఆనందంలో 2008 డీఎస్సీ అభ్యర్థులు
- మొదలైన సర్టిఫికెట్ల పరిశీలన
- తొలిరోజు 85మంది హాజరు.. నేడు కూడా అవకాశం



ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: 2008 సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులను కాంట్రాక్ట్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అయితే, అభ్యర్థుల్లో పలువురు ఇప్పటికే వివిధ ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కాగా, నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులకు సోమవారం ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. దీంతో పలువురు అభ్యర్థులు హాజరయ్యారు.

నేడు డీఈఓ కార్యాలయంలో...

పాత డీఈఓ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పించారు. కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీఈఓ వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16ఏళ్లుగా ఎదురుచూపులు

నాటి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో పలువురు అభ్యర్థులు అర్హత సాధించారు. అయితే, నియామకాలు చేపట్టకపోవడంతో సుమారు 16 ఏళ్లుగా పోరాడుతూనే జీవనోపాధి కోసం వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈనేపథ్యాన సోమవారం చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలనకు మైదాన ప్రాంతానికి చెందిన 128మందిలో 67మంది, ఏజెన్సీ ప్రాంతం నుంచి 215మంది అభ్యర్థులు 18మంది హాజరయ్యారు. ఈ ప్రక్రియను డీఈఓ సోమశేఖర శర్మ పర్యవేక్షించి ఉద్యోగులకు సూచనలు చేశారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మమ్మల్ని విధుల్లోకి తీసుకునే నిర్ణయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అయితే, మేం 16ఏళ్ల సర్వీస్ కోల్పోయాం. సర్వీస్ విషయమై సానుకూల నిర్ణయం తీసుకుని, రెగ్యులర్ ఉపాధ్యాయుల్లాగే సౌకర్యాలు కల్పించాలి. అంతేకాక మమ్మల్ని రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

– రేగళ్ల శేషు, గార్ల ఒడ్డు, ఏన్కూర్, ఖమ్మం జిల్లా

పట్టు వదల్లేదు



2008 డీఎస్సీలో ఎంపికై నా ఉద్యోగానికి ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో ప్రైవేట్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ కూడా రాశాను. ఇంతలోనే ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగానికి పిలుపు రావడం ఆనందంగా ఉంది.

– టి.సైమన్, విద్యానగర్‌కాలనీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

పిల్లలను తీర్చిదిద్దే అవకాశం



ఉపాధ్యాయ వృత్తి ద్వారా పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దే అవకాశం లభిస్తుంది. అందుకే 2008లో ఎంపికై ఉద్యోగం రాకున్నా ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరాను. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో బోధనకు, విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం రావడాన్ని సంతోషిస్తున్నా.

– భాగ్యలక్ష్మి, సారపాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సంతోషంగా ఉంది



2008 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించగా ఉద్యోగం వస్తుందా, రాదా అనే ఆలోచన ఉండేది. ఈ క్రమంలోనే ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని కాంట్రాక్ట్ పద్ధతిపై విధుల్లోకి తీసుకుంటుండడం హర్షణీయం.

– బి.అనిత, బయ్యారం, మహబూబాబాద్ జిల్లా

దర్బార్‌లో ఉద్యోగ దరఖాస్తులు ఇవ్వొద్దు

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వొద్దని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్ అధికారులకు అందజేశారు. వీటిని సత్వరమే పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని, దర్బార్‌లో కేవలం స్వయం ఉపాధి, ఇతరత్రా సమస్యలపై మాత్రమే విన్నవించాలని పేర్కొన్నారు. ఏపీవో(జనరల్) డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, వివిధ విభాగాల అధికారులు తానాజీ, రవీంద్రనాథ్, ఆర్.శ్రీనివాస్, భాస్కర్, ఉదయ్‌కుమార్, నరేష్, రమణయ్య, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారుల సమస్యలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

శరవేగంగా సాగర్ కాల్వ కట్టల నిర్మాణం



భారీ గండి పడిన ప్రాంతంలో నిర్మించిన కట్ట

- నీరు విడుదల చేస్తూనే పనులు చేపడుతున్న అధికారులు
- ఆయకట్టు పంటలకు ఇబ్బంది లేకుండా నిర్ణయం
- పంట సీజన్ పూర్తయ్యాక లైనింగ్, శాశ్వత పనులు

కూసుమంచి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ కాలువలకు భారీ గండ్లు పడి తీవ్ర నష్టం వాటిల్లిన విషయం విదితమే. ఈమేరకు గండ్ల పూడ్చివేత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. వరదలతో పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన ఔట్ ఫాల్ కాల్వకు 150 మీటర్ల మేర భారీ గండి ఏర్పడింది. దీంతో ఇక్కడి పొలాల్లోకి నీరు చేరి ఇసుక మేటలు వేసింది. ఈక్రమాన అధికారులు భారీ గండిని రేయింబవళ్లు శ్రమించి పూడ్చివేశారు. ఆరు మీటర్ల ఎత్తు, 150 మీటర్ల పొడవుతో ఏర్పడిన గండిని కంకర డస్ట్‌తో నింపిన బస్తాలు పేర్చి వందలాది లారీల మట్టితో పూడ్చారు. ఆపై గతంలో మాదిరి కట్ట కూడా నిర్మించడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి.

కాల్వ కట్టల పటిష్టతపై దృష్టి

మినీ హైడల్ ప్రాజెక్టు వైపు ఔట్ ఫాల్ కాల్వ కట్టలు తెగి గండ్లు పడగా అక్కడ కూడా పూడ్చివేశారు. ఇటువైపు కాల్వ కట్ట బలహీన పడటంతో జాతీయ రహదారి బ్రిడ్జి వరకు పటిష్ట పరిచే పనులు కొనసాగిస్తున్నారు. ఇక మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద తెగిన కాల్వ కట్టను కూడా చాలావరకు పూడ్చివేయగా ఇంకా కొంత పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో పాటు పాలేరు రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే ఇన్‌ఫ్లో కాల్వకు కూడా రంగుల బ్రిడ్జి వద్ద పడిన గండిని పూడ్చివేసే పనులు తుది దశకు చేరాయి. ఈ ప్రాంతంలో 45 మీటర్ల మేర కాల్వ కట్ట కొట్టుకుపోగా పునర్నిర్మిస్తున్నారు. రంగుల బ్రిడ్జి ప్రాంతంతో పాటు పాలేరు వద్ద కాల్వల గండ్లు పూడ్చివేత, పటిష్టతకు ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు కేటాయించింది.

ఓ పక్క పనులు.. ఇంకో పక్క నీటి విడుదల

కాల్వలకు గండ్లు పడి నీటి సరఫరా నిలిచిపోయి పంటలు ఎండిపోయే స్థితికి చేరడంతో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో అధికారులు పనులను శరవేగంగా చేపట్టారు. దీంతో సాగర్ నుండి పాలేరుకు అంతరాయం లేకుండా నీరు చేరుతుండగా, ఇటు పాలేరు నుండి జిల్లాలోని ఆయకట్టుకు సైతం సరఫరా చేస్తున్నారు. పాలేరు నుండి ఇప్పటి వరకు కాలువకు 3వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా సోమవారం 3,600 క్యూసెక్కులకు పెంచారు. ఈ కాల్వకు 5వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేసే సామర్థ్యం ఉండడంతో ఆ మేరకు కట్టలు సిద్ధం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం గండ్లు పూడ్చి రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ పంటల సీజన్ ముగిశాక కాల్వలకు లైనింగ్ చేపట్టి శాశ్వతంగా పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పాలేరు వద్ద కాల్వ కోతకు గురికాగా అక్కడ ప్రస్తుతానికి ప్రమాదం లేకపోవడంతో నీటి సరఫరా నిలిపివేశాక పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



పాలేరు వద్ద కోతకు గురైన కాలువ



జాతీయ రహదారి సమీపంలో కాలువ కట్టల నిర్మాణం